నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | అక్టోబర్ 28, 2024 | www.navatelangana.com

పోలీసుల ఆధ్వర్యంలో 2-కే రన్

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పోలీసులు ఆధ్వర్యంలో 2కే రన్ ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు పాఠశాల విద్యార్థులు, గ్రామ యువకులు పోలీస్ స్టేషన్ నుంచి బాలన్‌పూర్ వరకు సీఐ జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల అమరుల త్యాగాలు మరువలేవని, గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై అప్పారావు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీలో జిల్లా వాసికి చోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీలో ఆదిలాబాద్ జిల్లా వాసికి చోటుదక్కింది. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన మామిడాల దశరత్‌ను రాష్ట్ర సమాచార కార్యదర్శిగా ఎంపిక చేసినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సమావేశంలో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన మామిడాల దశరత్‌కు రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. పద్మశాలీ జాతి చైతన్యం కోసం, చేనేత పరిశ్రమ పరిరక్షణకు నిరంతరం కృషి చేయనున్నట్టు తెలిపారు.

పల్లె దారులకు మహర్దశ..!

- వరద ప్రభావానికి గురైన వాటికి మరమ్మతులు
- ప్రత్యేక నిధులు మంజూరుచేస్తూ సర్కారు ఉత్తర్వులు
- పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారులకు మోక్షం
- విడుదల కాగానే పనులు ప్రారంభించేందుకు ప్రణాళిక

అధిక వర్షాలతో వరదలు సంభవించి రోడ్లు నాశనం కావడం కావడం సాధారణంగా మారింది. ఇటీవల వరదల తాకిడికి శిథిలమైన రహదారులకు త్వరలోనే మోక్షం లభించనుంది. వీటి కోసం రాష్ట్ర ప్రకృతి విపత్తుల సంస్థ(ఎస్‌డీఆర్ఎఫ్) నుంచి నిధులు విడుదల కానున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం వాటికి అవసరమైన నిధులు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాని ఎన్ని నిధులు కేటాయించారో మాత్రం స్పష్టత లేకపోయినప్పటికీ.. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల పరిధిలో అధికారులు పంపించిన ప్రతిపాధనల ప్రకారం విడుదల కానున్నట్లు తెలిసింది. మరమ్మతులకు గురైన రహదారులన్నింటినీ బాగు చేసేందుకు ఈ నిధులు దోహదం చేయనున్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇన్నాండుల వాటిపై ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించిన ప్రయాణికులకు ఉపశమనం లభించనుంది.





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి ఏటా వరదలు సంభవించడం సాధారణంగా మారింది. గత కొన్నేండ్ల నుంచి అధిక వర్షాలు జిల్లాను అతలాకుతలం చేస్తున్నాయి. ఫలితంగా పంటలు వరద ప్రభావానికి గురికాగా..వీటితో పాటు పల్లె రహదారులు..ఆయా గ్రామాలకు రాకపోకలు వెళ్లేందుకు నిర్మించిన రోడ్లు, భవనాలశాఖ రహదారులు సైతం కొట్టుకుపోయాయి. అనేక చోట్ల కోతకు గురికావడం.. కొన్ని చోట్ల భారీగా గుంతలు పడటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాటి గుండా వెళ్లేందుకు ప్రయాణికుల నిత్య నరకం అనుభవిస్తున్నారు. ప్రతి ఏటా వరదలు రావడం రోడ్లు శిథిలం కావడం.. ఏండ్లుగా అవి అలాగే ఉండిపోవడం వంటి సమస్యల కారణంగా జనం తిప్పలు పడాల్సి వస్తోంది. ఇదే సమస్య ఉత్పన్నమవుతోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 93 నియోజకవర్గాల్లో ఈ రహదారుల బాగుకు రూ.25కోట్లు మంజూరుచేసింది. వీటిలో ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాలు కూడా ఉండటం గమనార్హం.

నిధులు విడుదల కాగానే పనులు

ప్రభుత్వం ఆయా పనులకు సంబంధించి నిధులు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇంకా వాటిని ప్రభుత్వం వాటిని విడుదల చేయలేదని తెలిసింది. ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీరాజ్ పరిధిలో 589 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. అప్పట్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి మరమ్మతులకు నిధుల కోసం ప్రతిపాధనలు రూపొందించారు. 137 పనులు చేపట్టేందుకు రూ.304కోట్లు అవసరమని ప్రభుత్వానికి పంపించారు. ఇక రోడ్లు భవనాలశాఖ పరిధిలో సుమారు 60కిలో మీటర్ల మేర రహదారులు కోతకు గురికాగా.. అనేక చోట్ల గుంతలు పడి అధ్వాన్నంగా మారాయి. 24చోట్ల వీటికి మరమ్మతులు పనులు చేపట్టేందుకు రూ.కోటి వరకు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. కాప్రి నుంచి బేల వరకు, చాందా(టి) నుంచి తరోడ వరకు, మన్నూర్ నుంచి డొంగరగావ్ వరకు, ఇచ్చోడ నుంచి దహెగాం తదితర రహదారుల్లో పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నిధులు రాగానే పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు.

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం

నర్సయ్య, ఆర్అండ్‌బీ ఈఈ, ఆదిలాబాద్

వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయించేందుకు నిధులు మంజూరైనట్లు తెలిసింది. కానీ ఇంకా అధికారికంగా విడుదల కాలేదు. ఇప్పటికే మరమ్మతులకు గురైన రోడ్లకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపించాం. అక్కడ్నుంచి నిధులు రాగానే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- దీపావళికి భద్రతా ప్రమాణాలు పాటించాలి
- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరని నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల తెలిపారు. ప్రజల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాబోయే దీపావళిని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే పేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పట్టణ పరిసర ప్రాంత పరిధిలోని ఆయా గ్రామాలలో ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసిన, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసిన, విక్రయాలు జరిపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీపావళిని పురస్కరించుకుని బాణాసంచా తయారీ, విక్రయదారులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా విక్రయాలు జరిపితే చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ రవాణ చేస్తున్న వడ్లు పట్టివేత



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గూడెం చెక్ పోస్ట్ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా మహారాష్ట్ర నుండి తెలంగాణకు ఐచర్ వ్యాన్‌లో తరలిస్తున్న 80 క్వింటాళ్ల వడ్లను పట్టుకున్నామని ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతులకు సన్నవడ్లకు రూ.500 బోనస్‌లో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు రాకుండా సరిహద్దు ప్రాంతంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రూ.500 బోనస్ డబ్బులు తెలంగాణ రాష్ట్ర రైతులకు తప్ప ఇతర రాష్ట్రాల వారికి వర్తించని కారణంగా ఇలా ఎలాంటి అనుమతులు లేకుండా తెలంగాణకు తీసుకువస్తున్నారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా ఆదేశాలమేరకు సివిల్ సప్లయి అధికారులకు పట్టుకున్న వడ్లను అందించామన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని డెయిలీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు శ్రీకాంత్, శంకర్ తెలిపారు. వివిధ గ్రామాల నుండి పది జట్లు పాల్గొన్నాయని, డుబ్లీకేట్ ఓవర్స్, ప్రత్యేక ఓవర్లు పోటీని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. దీనికి సహకరించిన ప్రజలకు, క్రీడాకారులకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడా పాఠశాల విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడ పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఈనెల 28 నుంచి 30 వరకు మహబూబ్ నగర్‌లో జరిగే 43వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను, వారి ఎంపికకు కృషిచేసిన కోచ్ తిరుమల్‌ను జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి బండ మీనారెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, ఏసీఎంఓ పి.ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, కోచ్‌లు అరవింద్, విద్యాసాగర్, హెచ్‌డబ్ల్యూఓ సాయిబాబా, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు జోనల్ స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 28న సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్-14, 17 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి బాలబాలికల స్విమ్మింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1జనవరి 2008 తర్వాత పుట్టినవారు 17 సంవత్సరాల విభాగం, 1జనవరి 2011 తర్వాత పుట్టిన వారు 14 సంవత్సరాల విభాగంలో ఎంపిక పోటీలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రం బోనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్ రిపోర్ట్ చేయాలని సూచించారు. ఇతర వివరాలకు 7702035200 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఆరు నెలల్లో సిరాల ప్రాజెక్టు పనుల పూర్తి

- పునర్నిర్మాణ పనులకు భూమిపూజ
- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

ఆరు నెలల్లో సిరాల ప్రాజెక్టు పనులు పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం రూ.8కోట్ల నిధులతో చేపట్టనున్న సిరాల ప్రాజెక్టు, ఇలేగాం చెరువు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. 18 నెలల కింద సిరాల ప్రాజెక్టు భారీ వర్షాలతో తెగిపోయిందని, ఆ సమయంలో తాను అక్కడే ఉండి రైతుల కష్టాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక సిరాల ప్రాజెక్టుకు పూర్వ వైభవం తెచ్చేందుకు తెచ్చేందుకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని విన్నవించడం జరిగిందన్నారు. రైతాంగ సంక్షేమమే తన ధ్యేయమని ప్రాజెక్టు పూర్తి చేసి సిరాల ఇలేగాం, దేగాం, రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రభుత్వం తమది కానప్పటికీ, ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తామన్నారు. అప్పటి పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా నిజాం కాలం నాటి సిరాల ప్రాజెక్ట్‌ను ఎవరు పట్టించుకోలేదన్నారు. ఒకప్పుడు నియోజకవర్గంలో ఇదే పెద్ద ప్రాజెక్టు అన్నారు. రైతులు, మత్స్యకారులు, నష్టపోయారని ప్రభుత్వం వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిరాల గ్రామస్తులు పలు సమస్యలను విన్నవించారు. అదేవిధంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆనంద్ రావ్ పటేల్, ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ మురళీధర్‌రెడ్డి, డీఈఈ అనిల్ కుమార్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సోలంకి భీంరావ్, సాప్లీ రమేష్, పండిత్‌రావ్ పటేల్, మాజీ సర్పంచ్‌లు చిన్నన్న, శ్రీనివాస్, మహిళ మోర్చా మండలాధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ సుభాష్, సిరాల, ఇలేగామ్ గ్రామ పెద్దలు, మండల నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధితో రెవెన్యూ ఉద్యోగి మృతి

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్



పట్టణంలోని ఇంద్రానగర్ వీధికి చెందిన కాశవేణి రమేష్ అనే రెవెన్యూ ఉద్యోగి క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నారు. అయిన వ్యాధి తీవ్రమై ఆదివారం మృతి చెందాడు. ఆదివారం సాయత్రం పట్టణంలోని నివాస స్థలానికి మృతదేహాన్ని తీసుకువచ్చారు. రమేష్ మృతిపట్ల ఇంద్రానగర్ కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న ఈయనకు భార్య ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. గతంలో ఈయన ఎమ్మెల్యే పీఏగా కూడా పనిచేశారు.

అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-సారంగాపూర్

నిర్మల్ భోథ్ సరిహద్దు ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుందని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నజీర్ ఖాన్ తెలిపారు. ఆదివారం అడెల్లి, భోథ్, నిర్మల్ అటవీ ప్రాంతంలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్స్, టైగర్ మానిటరింగ్, ఫుట్ పెట్రోలింగ్ అటవీ ప్రాంత అంచున వంట చెన్ల వెంబడి కూంబింగ్ నిర్వహిస్తున్నారని అన్నారు. పెద్ద పులికి సంబంధించిన ఆనవాళ్లు పులి అడుగులను గుర్తించారని అన్నారు. అటవీ ప్రాంత సమీప వ్యవసాయ రైతులు, పశువుల, మేకల కాపర్లు అటవీ లోపలికి వెళ్లోదని, అప్రమత్తంగా ఉండాలన్నారు. పెద్దపులి అటవీ లోపల ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అటవీ క్షేత్రస్థాయి అధికారులు ఉన్నారు.

మరాఠీ భాష అస్తిత్వాన్ని కాపాడేలా కార్యక్రమాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మరాఠీ భాష అస్తిత్వాన్ని కాపాడేలా కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమైన విషయమని మరాఠీ భాషిక్ జన కళ్యాణ్ జిల్లా కార్యదర్శి అనిల్ సావ్లే అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డులోని శిశు మందిర్‌లో మరాఠీ మీడియం ఉపాధ్యాయులను మరాఠీ భాషిక్ జన కళ్యాణ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారికి శాలువాతో సత్కరించి సేవలను కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డీఎస్సీలో 21 మంది మరాఠీ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మరాఠీ భాషిక్ జన కళ్యాణ్ జిల్లా కార్యదర్శి అనిల్ సావ్లే మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మరాఠీ మీడియానికి ఆదరణ తగ్గిందన్నారు. ఇలాంటి తరుణంలో పలువురు మరాఠీ అస్తిత్వాన్ని భవితరాలకు అందించేందుకు డీఎస్సీలో రాణించి ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. మరాఠీ ఔనత్యాన్ని చాటేలా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. భవిష్యత్తులో బేలలో మరాఠీ కళాశాల ఏర్పాటు చేసిన గత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందిస్తు గతంలో ఎన్నడూ లేని విధంగా మరాఠీ మీడియంలో 21 మందినికి నియమించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్ గుర్నూలే, సుభాష్ రాథోడ్, మనోహర్, విజయ్ బోయర్, శివాజీ, విఠల్, బాపూరావ్, అనిల్ సావర్, విశాల్, గణేష్ సూర్యవంశీ, సతీష్ గుర్మలే, దత్త, కేశవ్, గోపాల్, రితేష్, దేవిదాస్, మినా, మనిషా, దీపా, నంద పాల్గొన్నారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి రిమాండ్



నవతెలంగాణ-కుబీర్

గొంగతనానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై రవీందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని విఠలేశ్వర్ ఆలయంలో శనివారం రాత్రి ఆలయంలో దొంగతనం జరిగినట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు పెంటాజీ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. కాగా ఆలయాన్ని పోలీసులు పరిశీలించి, దండుగుడు ఆలయంలో తలుపులు పాగులగొట్టి లోపలికి వెళ్లి హుండీ తాళం పగలగొట్టి భక్తులు సమర్పించిన కానుకలను ఎత్తుకెళ్లాడు. చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు పట్టుకొని విచారణ చేపట్టారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన శివరామ్‌గా గుర్తించి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వం ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలి



నవతెలంగాణ-బోథ్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు రావుల శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ప్రాధాన్యతనిస్తూ వారి సమస్యలను తీర్చడానికి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తొమ్మిది నెలల కాలం గడిచినా ఉద్యమకారుల సమస్యలు అలానే ఉన్నాయన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమ కారులందరికి 250 గజాల ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఫ్రీ బస్సు సౌకర్యం, గుర్తింపు కార్డులతో పాటు అమరులైన ఉద్యమకారుల కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సురేష్ వైద్య, అప్పాల శ్రీనివాస్‌రెడ్డి, సంగు స్వామి, బ్రహ్మానందం, తక్కల శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.గంగయ్య జె.ఆనంద్, సమీర్, రావూఫ్, సత్యనారాయణ, దాస్, తిరుమల్, సగీర్, ఇమ్రాన్, ఇస్మాయిల్ సంతోష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

బస్‌షెల్టర్‌ను ప్రారంభించిన ఎంపీ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని నాగాపూర్ బస్‌షెల్టర్‌ను ఆదివారం ఎంపీ గోడం నగేష్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన కందుకూరి అంజన్న, కందుకూరి రాజన్న జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గ్రామ ప్రజల సౌకర్యార్థం నూతన బస్‌షెల్టర్ చౌరస్తా వద్ద నిర్మించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గోడం నగేష్ ముఖ్యఅతిధిగా హజరై మాట్లాడారు. ప్రజలు వర్షాకాలం ఎండాకాలంలో ఈ బస్‌షెల్టర్‌ను



సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మించిన కందుకూరి కుటుంబ సభ్యులు కందుకూరి రమేష్‌ని, కందుకూరి ప్రవీణ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను ఎంపీ నగేష్ అభినందించారు. అనంతరం ఎంపీ గోడం నగేష్‌ను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అడెల్లి ఆలయాన్ని దర్శించుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని ఆదివారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులను ఆలయ అధికారి రాజేష్ శాలువాతో సత్కరించి, అమ్మవారి ప్రతిమను అందజేశారు. పీపీ వెంట మాజీ ఆలయ కమిటీ చైర్మెన్ మాధవ్‌రావు, న్యాయవాది లింగాగౌడ్, స్థానిక ఎస్సై శ్రీకాంత్ ఆలయ సిబ్బంది ఉన్నారు.



ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులతో పాటు యాజమన్యాల సమస్యలు తనకు తెలుసుని, పట్టభద్రుల ఎమ్మెల్సీలో తాను గెలిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ భవనంలో ట్రస్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుతో పాటు ప్రయివేట్ పాఠశాలల నుంచి బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని సమావేశం నిర్వహించారు. ముందుగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. అనంతరం అభ్యర్థిగా పోటీ చేస్తున్న యాదగిరి శేఖర్‌రావ్ గురించి పలువురు తెలియజేశారు. అనంతరం ఓటరు నమోదుపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ కరోనా సమయంలో ఇంటి బయటకు రాని సమయంలో ప్రయివేట్ ఉపాధ్యాయుల కోసం నిరాంతం శ్రమించానని తెలిపారు. మంత్రుల నుంచి ముఖ్యమంత్రి, అధికారులను కలిసి ఒకొక్క టీచరు కరోనా సమయంలో స్కూళ్ల మూత పడిన సందర్భంలో రూ.2వేలతో పాటు 25 కిలోల బియ్యం అందించడంలో కీలకంగా వ్యవహరించానని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల యాజమన్యాలతో పాటు ఉపాధ్యాయులకు అనేక సమస్యలున్నాయన్నారు. సమస్యలు తెలిసిన వ్యక్తి ఎమ్మెల్సీగా ఉంటే వాటి పరిష్కారం సాధ్యమవుతుందని పోటీ చేస్తున్నామన్నారు. నేషనల్ ప్రయివేట్ స్కూల్ యాజమన్యాలు కూడా తనకు మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. ఓటరుగా నమోదు చేసుకొని తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగినేని పవన్‌రావు, వకులభరణం ఆదినాథ్, దేవేందర్ పటాస్కర్, పురుషోత్తంరెడ్డి, అతీక్ ఉర్ రహ్మాన్, ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబానికి సరుకులు అందజేత



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శాంతినగర్ కాలనికి చెందిన దావీద్ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఆదివారం ఈ విషయాన్ని తెలుసుకొని వారి కుటుంబానికి నెలకు సరిపడ సరుకులను ఆదివాసీ యువజన సంఘం నాయకుడు దుర్వ మహేష్ అందజేశారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘం అధ్యక్షుడు కొమ్ము బాబురావు, నరేష్, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

దండారి ఉత్సవాల్లో పాల్గొన్న ఆడే గజేందర్



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని మంగల్ మోట, మాదాపూర్ గ్రామాలకు చెందిన దండారి గుస్సాడీ ఉత్సవాల్లో భాగంగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సన్మానం చేశారు. గ్రామంలోని సమస్యలను విన్నవించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తానని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల కన్వీనర్ ఆడే వసంతరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, తొడసం శంకర్, సంబన్న, తులసిరామ్, సోనేరావ్, నాందేవ్, గ్రామపటేల్, దేవారి మహజన్, పూజారి, గ్రామస్తులు నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని చాందా(టి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త పెర్క అశోక్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, పోరెడ్డి కిషన్, ఎంఏ షకీల్, ఆదిలాబాద్ రూరల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అంచెట్టి నాగన్న, నాయకులు సింగిరెడ్డి రామ్ రెడ్డి, బండి దేవిదాస్‌చారి, ఎల్మ రామ్‌రెడ్డి, సయ్యద్ షాహిద్ అలీ, మాజీ సర్పంచ్ బొజ్జ అడెల్లు, మాజీ ఉపసర్పంచ్ లంక సుదర్శన్, కాప్లే పోచ్చిరామ్, డాక్టర్ మారుతీ, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తియ్యని సీతాఫలం.. ఔషధ గుణాలు పుష్కలం..

- ఆదిలాబాద్‌లో సందడిగా విక్రయదారులు





సీతాఫలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శీతాకాలంలో ప్రత్యేకత కలిగిన పండ్లల్లో సీతాఫలం ఒకటి. సీజన్ ఆరంభం కాకముందే ఈ ఏడాది మార్కెట్లోకి సీతాఫలాలు వచ్చేశాయి. ఏ సీజన్‌లో తినాల్సినవి ఆ సీజన్‌లో తినాలనే కోరిక ప్రజల్లో బలంగా ఉండటంతో ధర ఎక్కువైనా ఆసక్తి కనబరుస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా మధ్యలో వివిధ మండలాల నుంచి సీతాఫలాలు పోటెత్తుతున్నాయి. మూడు నెలల పాటు ఉండే సీజన్‌లో వీటిని తినేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా గిరి గ్రామాల నుంచి వచ్చిన వారు పొద్దంతా కూర్చొని అమ్ముతున్నారు. వందకు 3 నుంచి 12 సైజు బట్టి విక్రయిస్తున్నారు. గుల్లాలు, క్యారెట్లు అయితే రూ.500 నుంచి 1500 వరకు విక్రయిస్తున్నారు. అలాగే ఉదయాన్నే గుల్లలో పండ్లను పెట్టుకొని కాలనీ, వీధుల్లో విక్రయిస్తున్నారు. కొందరు కొనుగోలు దారులు సైతం గంప గుత్తగా గుల్లలను కొనుగోలు చేస్తున్నారు. వీటిని. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ కూడా తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

సమృద్ధిగా విటమిన్-సీ..

సీతాకాలంలో 3 నెలల పాటు సీజనల్ ఫ్రూట్‌గా లభ్యమవుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎదిగే పిల్లలకు ఈ పండు చాలా మంచిది. వీటిలో క్యాల్షియం, విటమిన్ సీ సమృద్ధిగా దొరుకుతుందంటున్నారు. ఆహారం తేలికగా జీర్ణమయ్యేందుకు సీతాఫలంలోని పీచు పదార్థం ఉపయోగపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఏసీజన్‌లో పండిన పండును ఆ సీజన్‌లో తినడం ద్వారా మంచి ఆరోగ్య వంతమైన జీవనం సాగించవచ్చని వైద్య నిపుణులు అంటున్నారు. ఉదయం లేచి పంట పొలాల్లోని చెట్ల నుంచి వీటిని కోసి తీసుకువస్తున్నామని విక్రయదారులు చెబుతున్నారు. అయితే కొందరు అడవి నుంచి తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు. అటవీ శాఖ అధికారులు కూడా వీరికి భూములు లేవని మానవత దృకృదంతో సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి పర్చండి

నవతెలంగాణ-ఉట్నూర్

వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా ప్రాంతాన్ని ముఖ్యంగా ఖానాపూర్ నియోజవర్గంలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శిశువు సంక్షేమ శాఖ జిల్లా మంత్రి ధనసరి సీతక్కను కోరారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో వివిధ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సీఎస్ఆర్ నిధులతో వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరచాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కను ఎమ్మెల్యే కోరారు. ఖానాపూర్ నియోజవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రయివేటు రంగ సంస్థలు ప్రభుత్వంతో కలిసి అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను గుర్తించి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లో ఉన్న యువతి, యువకులకు ఉపాధిని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఆర్‌పీ, సీఈఓ దివ్య దేవరాజన్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ములుగు కలెక్టర్ దివాకర్ టీఎస్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-బేల

మండలంలోని సాంగిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తులు భారీగా తరలివచ్చారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఐదుగురు వైద్యానిపుణులు దాదాపుగా 300 మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సేవలు చేయడం ట్రస్ట్ ముఖ్య ఉద్యేశమని పేర్కొన్నారు. ప్రతి మనిషి అనేక సమస్యలతో అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. బీపీ, షుగర్ లాంటి వ్యాధులకు సాధారణమైన వైద్యంతో అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పైగా రోగులకు గుండె, కిడ్నీ, నరాలు, చిన్న పిల్లలకు సంబంధిత పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చినటువంటి వైద్య బృందానికి శాలువాతో సన్మానించి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యకమంలో వైద్య సిబ్బందితో పాటు సామ రూపేష్‌రెడ్డి, తిరుమల ట్రస్ట్ సభ్యులు అనుముల ఉదయ్ కిరణ్, నరేష్, సుమన్, సునీల్, రవి, చంద్రకాంత్‌రెడ్డి వైద్య సిబ్బందితో పాటు గ్రామస్తులు నర్సారెడ్డి, దయాకర్ పటేల్, సుధాకర్, వినోద్, ప్రవీణ్, జగదీష్‌రెడ్డి, కదరపు గణేష్, మంచికంటి సాయి, నవనీత్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు రానున్న బీసీ కమిషన్ బృందం

- జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాట్లు పూర్తి
- పాల్గొననున్న ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బీసీ కమిషన్ జిల్లాల వారీగా బహిరంగ విచారణ చేపట్టనుంది. ఇందులో భాగంగానే తొలుత ఉమ్మడి ఆదిలాబాద్‌కు సంబంధించి బహిరంగ విచారణ సమావేశాన్ని సోమవారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. దీనికి కమిషన్ చైర్మెన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మీ విచారణ నిమిత్తం ఆదిలాబాద్‌కు రానున్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, కుల సంఘ ప్రతినిధుల నుంచి దరఖాస్తులతో పాటు సూచనలను స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించే బహిరంగ విచారణ సభకు సంబంధించి ఏర్పాట్లను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ఉదయం పది గంటల నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు ఆదిలాబాద్, 11 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆసిఫాబాద్, 2 గంటల నుంచి మూడు గంటల వరకు మంచిర్యాల, మూడు నుంచి 4 గంటల వరకు నిర్మల్ జిల్లాల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ప్రజల సౌకర్యార్థం నోటరీ ఏర్పాటు..

బహిరంగ విచారణకు బీసీ కమిషన్ చైర్మెన్ రానున్న సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో అన్ని ఏర్పాట్లు చేశామని, బీసీ వెల్ఫర్ అధికారి రాజలింగు తెలిపారు. రిజర్వేషన్ల ప్రక్రియపై కమిషన్ సభ్యులు సలహాలు, సూచనలతో పాటు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. రూ.20 జ్యూడిషియల్ స్టాంపు పేపర్‌పై ప్రభుత్వ నోటరీ సంతకంతో ఆమె ఆక్షేపణాలు కమిషన్‌కు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం జెడ్పీ సమావేశ ఆవరణలో నోటరీని కూడా అందుబాటులో ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.

గోర్ మల్లావోను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గోర్ మల్లావోను విజయవంతం చేయాలనీ గోర్ సిక్వడి రాష్ట్ర నాయకులు రాములు నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సేవాదాస్‌నగర్ సేవాలాల్, జగదంబ, ఆలయంలో ఏర్పాటు చేసిన లంబాడా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా గుడి తండాలో గోర్ సిక్వడి ఆధ్వర్యంలో 24, 25 నవంబర్ నెలలో ఏర్పాటు చేసుకునే గోర్ సిక్వడిలో, గోర్ మల్లావో సమావేశాన్ని లంబాడ, బంజారా ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చారులత రాథోడ్, లంబాజీ, పవార్ గోకుల్‌దాస్, రాథోడ్ భీమ్‌రావు, భారత్ చవాన్, విశ్వనాథ్, జగన్, రితేష్, విజేశ్, చంద్రకాంత్, గణేష్, రవీందర్, ప్రవీణ్, సురేష్, నారాయణ్ పాల్గొన్నారు.



ఆదివాసీ గ్రామాల్లో దండారి ఉత్సవాలకు శ్రీకారం

- భోగి పూజతో గుస్సాడీ సందడి ప్రారంభం



నవతెలంగాణ-నార్నూర్

దీపావళి పండగను పురస్కరించుకుని ఉమ్మడి నార్నూర్ మండలంలోని ఆయా ఆదివాసీ గ్రామాల్లో మూడు రోజులతో భోగి పండుగతో దండారి ఉత్సవాలకు ఆదివాసులు శ్రీకారం చుట్టారు. ఉత్సవాలను ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయం ప్రకారం ఆదివాసీ గ్రామాలలో గ్రామపటేల్ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం మండలంలోని ఎంపల్లి, అర్మీయాన్ తదితర గ్రామాల్లో భోగి నిర్వహించారు. తాడిహత్నూర్, గంగాపూర్, గుంజాల, జామడ, మాన్యాపూర్, కొత్తపల్లి, భీంపూర్, నాగల్కొండ బేతల్ గూడ, సుంగాపూర్, మాంజ్రి, బాబేఝరి, ఖైర్ డాట్వ, ఏంపల్లి, బొప్పాపూర్, ఖడ్కి, లోకారి(కే), లోకారి(బి), అర్జుని, పర్సవాడ, పిప్రి, ధాబా(కే), ధాబా(బి), పౌనూర్, లొద్దిగూడ, కొలామా, రూపాపూర్, మెడిగూడ గ్రామాలలో దండారి ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఆదివాసులు తరతరాల నుంచి వస్తున్న ఆదివాసీ ఎత్మాసూర్ పెన్, దీపావళి పండుగకు ప్రతి యేటా పూజలు చేసి ఆదివాసీ సాంస్కృతి సాంప్రదాయం ప్రకారం నెమలి పించం టోపీ, గజ్జెలతో రకాలుగా అలంకరించి గుస్సాడి వేషధారణ వేయడం జరుగుతుందని, ఆదివాసులు పేర్కొన్నారు. డోల్, పేప్రే, తుడుం, కలికోమ్, సుర్ణ, పొంగా, డప్పులు కోలాటాలు కొత్త దుస్తులతో దండారి చిచోయ్ నాట్యం చేస్తారు. దండారి ఉత్సవాలు వారం రోజుల పాటుగా డప్పు గజ్జెల చప్పుళ్లతో సందడిగా మారనుంది.

ఎమ్మెల్యేను కలిసిన మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



నవతెలంగాణ-నేరడిగొండ

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆదివారం నేరడిగొండలోని తన నివాసంలో మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని పరిచయం చేసుకొని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొప్పుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, గౌరవాధ్యక్షులుగా మేకల మల్లన్న, గంపల ప్రభాకర్, ఏర సుధీర్, నాయకులు బేర దేవన్న, సూరం భగవాండ్లు, మొట్టె కిరణ్, రాళ్లబండి శంకర్, పాశం రాఘవేంద్ర, ముచ్చ రఘు పాల్గొన్నారు.

ఉద్యోగులను ప్రభుత్వం నిరాశకు గురి చేసింది

- ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జుట్టు గజేందర్

నవతెలంగాణ-నిర్మల్

పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో రాష్ట్ర ప్రభుత్వం ఒకటి మాత్రమే విడుదల చేయడం వలన ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జుట్టు గజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆరు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం కరువు భత్యం విడుదల చేస్తుందని, తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఐదు డీఏలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం ఒకటి మాత్రమే విడుదల చేయడం సరికాదని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులందరికి పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను తక్షణమే చెల్లిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గత పదినెలలుగా ఉద్యోగులు ఓపిక పట్టారని అన్నారు. ఉద్యోగుల జేఏసీతో ముఖ్యమంత్రి జరిపిన చర్చల అనంతరం కనీసం రెండు లేదా మూడు డీఏలు విడుదల చేస్తారని ఉద్యోగులు భావించి, మంత్రివర్గం నిర్ణయం కోసం ఆశగా ఎదురు చూశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పున్ల సమీక్షించి, వెంటనే డీఏలు అన్నింటిని విడుదల చేయాలని ఎస్టీయూ పక్షాన డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అండర్-17, 14 బాల బాలికల అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను ఈనెల 29న జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 29న చాంద(టి) క్రికెట్ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1జనవరి2008 తర్వాత పుట్టిన వారు 17 సంవత్సరాల విభాగం, 1జనవరి2011 తర్వాత పుట్టిన వారు 14 సంవత్సరాల విభాగంలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలతో పోటీల ఆర్గనైజర్ వీజీఎస్ రాకేష్‌కు ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

జిల్లాస్థాయి యోగా ఎంపిక పోటీలు...

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 29న మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియం జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్టీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9:30 గంటలకు పోటీల ఆర్గనైజర్ రేణుక పీడీకి రిపోర్టు చేయాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన ఏలేటి జీవన్‌రెడ్డి కుమారుడు ఏలేటి మనోజ్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా కుమురంభీం వర్ధంతి

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని వీర్దండి గ్రామంలో ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీం వర్ధంతిని ఆదివారం ఆదివాసులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆదివాసీ సాంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించి భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మంతయ్య మాట్లాడుతూ జల్, జంగల్, జమిన్ కోసం పోరాడిన యోధుడు భీం అని, ప్రతి ఒక్కరూ కుమురం భీంని ఆదర్శంగా తీసుకోని వారి అడుగుజాలల్లో నడిచి పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాడవి రేణుక, మాజీ ఉపసర్పంచ్ బండు, పోచాని టీచర్, గ్రామ పెద్దలు పరిచకే రామచందర్, ఆత్రం నాందేవ్, మడపతి మారుతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీం స్మారక జెండా పూజ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈనెల 30న జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్‌లో గల భీం విగ్రహం వద్ద నిర్వహించే స్మారక జెండా పూజ పోస్టర్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుమురం భీం ఆదివాసుల ఆరాధ్య దైవమన్నారు. ఈనెల 30న నిర్వహించే 84వ భీం స్మారక జెండా పూజ విజయవంతం చేయాలని, ఆదివాసులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో గోండ్వాన రాష్ట్ర అధ్యక్షుడు సిడాం రాజు, రాయి సెంటర్ జిల్లా అధ్యక్షుడు మడావి శ్రీనివాస్, సార్మెడి గణేష్, కుమురం భీం వారసులు కుమరం వెంకటేష్, కుమురం రాము, అంబరావ్ పాల్గొన్నారు.

మృత్యువులో వీడని స్నేహం

- ఉదయం క్రికెట్ ఆటతో వీరి దినచర్య
- కొనసాగుతున్న గాలింపు చర్యలు..
- జహీర్, ఇర్షాద్‌ల శవం లభ్యం
- పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రామానుజం





నవతెలంగాణ-బెజ్జూర్

వారి స్నేహం మృత్యువు కూడా విడదీయ లేదు. సరదా కోసం ప్రాణహితకు వెళ్లిన ఆ స్నేహితులు చివరకు విగత జీవిలా తిరిగి వస్తారని ఎవరు ఊహించలేరు. ఉదయం నుండి క్రికెట్ ఆటతో వారి దినచర్య కొనసాగుతూ విడదీయలేని స్నేహబంధంగా మారింది. ఆ బంధం చివరకు మృత్యు ఒడిలోకి చేరింది. ఆ కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. శనివారం సరదా కోసం ప్రాణహిత ఎర్రబండ వద్ద స్నానానికి వెళ్లిన జహీర్, ఇర్షాద్, మోహిజ్‌లు ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైన విషయం తెలిసిందే. వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం ఉదయం జహీర్ మృతదేహం లభ్యమైంది. తలాయి గ్రామ సమీపంలో మాజీ ఎంపీటీసీ లంగారి శ్రీనివాస్‌కు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మిగతా ఇర్షాద్, మోహిజ్ మృతదేహాల కోసం డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. మహారాష్ట్రకు చెందిన రెస్క్యూ టీంను తెప్పించి ప్రాణహితలో జల్లెడ పడుతున్నారు. సుమారు 8 కిలోమీటర్ల దూరం వరకు ప్రాణహిత నదిలో పడవ సాయంతో ఇద్దరి శవాల కోసం వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు. లభ్యమైన జహీర్ శవానికి పంచనామా చేపట్టి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై విక్రం తెలిపారు. చేతికొచ్చిన కొడుకులు ఇక లేరని తెలిసిన తల్లిదండ్రుల రోదనలు విన్నంటాయి. కళ్ళముందే స్నేహితులు కొట్టుకపోతున్న కాపాడలేని స్థితిలో ఉండిపోయానని, తనకు ఈత వచ్చి ఉంటే తన స్నేహితులను కాపాడుకునే వాడినని మరో స్నేహితుడు ఖాజీం ఆవేదన వ్యక్తం చేస్తూ రోధిస్తుంటే పలువురిని కంటతడి పెట్టించింది. కాగా సాయంత్రం సమయంలో మహారాష్ట్ర రెస్క్యూ టీంకు ఇర్షాద్ మృతదేహం లభ్యమైంది. మోహిజ్ శవం లభ్యమయ్యే వరకు గాలింపు చర్యలను కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్డం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విక్రం పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన నాయకులు

ప్రాణహితలో ప్రమాదవశాత్తు గల్లంతైన ముగ్గురు యువకుల కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ దండేవిఠల్, మాజీ జడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు రావి మురళీ వేరువేరుగా పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సంఘటన విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి తమ వంతు సాయం అందే విధంగా చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. గాలింపు చర్యలను ముమరం చేయాలని పోలీసులకు ఆదేశించారు. మృతదేహాలు వెలికి తీసేందుకు రెస్క్యూటింలను రంగంలోకి దింపాలని పోలీసులకు ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. ఘటన వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. బాదిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్షద్ హుస్సేన్, రాచకొండ శ్రీ వర్ధన్, నాహీర్ అలీ, మాజీ జడ్పీటీసీ పుష్పలత, సామల రాజన్న, మాజీ కోఆప్షన్ సభ్యుడు బషరత్, పుల్లూరి సతీష్, ప్రకాష్, రంగు సురేష్ ఉన్నారు.



ఇర్షద్ మృతదేహం



జహీర్(ఫైల్)

షరతులు లేకుండా ఎంఎల్‌హెచ్‌పీలను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న జిల్లా నూతన కమిటీ ఎంపిక ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దివాకర్, బోగే ఉపేందర్‌ల అధ్యక్షతన జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో 2020 నుండి పలు దఫాలుగా ఎంఎల్‌హెచ్‌పీలు నియామక ప్రక్రియ జరిగిందన్నారు. వీరందరిని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎంబీబీఎస్ డాక్టర్స్, ఆయుర్వేద వారితో సమానంగా బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ చేసిన ఎంఎల్‌హెచ్‌పీలు పని చేస్తున్న రూ.29వేలుగా తక్కువ వేతనం ఇస్తున్నారని, రూ.45000 ఇవ్వాలన్నారు. మిగిలిన రాష్ట్రాల్లోని ఎంఎల్‌హెచ్‌పీల మాదిరిగానే వీరికి కూడా నెలకు రూ.41000 జీతాన్ని చెల్లించాలని కోరారు. ఫీల్డ్ లెవల్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు గణేష్, రాందాస్, ప్రశాంత్, సారిక, కీర్తన, తిరుమల, సుచరిత, ప్రశాంత్, విజయ, సాగర్ పాల్గొన్నారు.

సంఘం జిల్లా అధ్యక్షుడిగా గణేష్

మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌ల జిల్లా నూతన కమిటీని ఎన్నుకోగా సంఘం అధ్యక్షుడిగా గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా గౌరవ అధ్యక్షుడుగా బోగే ఉపేందర్, ఉపాధ్యక్షులుగా ఆర్.కీర్తన, జి.ప్రశాంత్, విజయ్ సాగర్, ప్రధాన కార్యదర్శిగా వి.సారిక, జాయింట్ సెక్రటరీగా ఎస్.రాందాస్, డి.ప్రకాష్, కోశాధికారిగా శ్రేష్మలను ఎన్నుకున్నారు.

ఆకట్టుకున్న దండారి సంబరాలు



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబించేలా దండారి సంబరాలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం మండలంలోని పెద్ద సాకడ గ్రామంలో చిన్న సాకడ గ్రామానికి చెందిన దండారికీ అతిథ్యనిచ్చారు. గ్రామంలో భక్తి శ్రద్దలతో ఎత్మసూర్ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మేలా, పర్రా, వెట్టే సాంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ కోలాటం, డోల్కీ నృత్యాలు చేశారు. డప్పుల దరువుతో గుస్సాడీ నృత్యాలు చూపపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నృత్యాలు చేస్తున్న సమయంలో మగవారు హాస్య నాటికలు ప్రదర్శించి ప్రేక్షకులను నవ్వించారు. అతిథిగా వచ్చిన దండారికి గ్రామస్తులు గౌరవ మర్యాదలతో హారతి ఇచ్చి దండారి బృందాన్ని గ్రామానికి సాగానంపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందూర్ ఆనందరావు, గ్రామ పటేల్లు పెందూర్ దంబిరావు, కుర్సెంగా సోంజీ, మాజీ సర్పంచ్ జలపతిరావు, సేడ్మాకి తుకారాం, పెందూర్ శ్రీనివాస్, దండారి యజమానులు బిలాజీరావు, ఇశ్రు, గ్రామస్తులున్నారు.

ఆదివాసుల అభివృద్ధికి చర్యలు

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ పునరుద్ఘాటించారు. మండలంలోని మోవాడు గ్రామంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కుమురం భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, పార్టీలో చేరిన మాజీ ఎంపీటీసీ లింగు, మాజీ సర్పంచ్ కౌసల్యలకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆదివాసుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ముందుకు పోతుందన్నారు. జన్ మన్ పథకం ద్వారా వెనుకబడిన వర్గాలైన పీవీటీజీల మౌలిక వసతులు విద్య వైద్య అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. అవినీతి రహిత దేశం కోసం బీజేపీ కృషి చేస్తుందన్నారు. మోడీ సంక్షేమ పథకాలతో ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, అసెంబ్లీ ఇన్‌చార్జి విజయ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మీ, మాజీ వైస్ ఎంపీపీ మంగ పెంటయ్య, బీజేపి సీనియర్ నాయకుడు ప్రసాద్ గౌడ్, శ్రీకాంత్, ప్రహ్లాద్, సంతోష్, సత్తన్న, పెంటన్న, వెంకన్న గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంకలమ్మ జాతర పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-కౌటాల

కంకలమ్మ జాతర వాల్ పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్టపై ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు సుల్వ కళ్యాణి కనకయ్యల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం డిసెంబర్ నెలలో జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు సమీష్టిగా కృషి చేయాలని కోరారు. ఇప్పటి నుండి జాతర ఏర్పాట్లపై ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులున్నారు.

కేబినెట్ నిర్ణయాన్ని పునరాలోచించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఉద్యోగ ఉపాధ్యాయులు ఎప్పటినుండో ఎదురుచూస్తున్న డీఏలు ఇతర ఆర్థిక నిర్ణయాల పట్ల క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడం, జీఓ317 సమస్యలపై దాటవేత వైఖరి పట్ల రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని, పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని, జీఓ317 బాధితులందరికీ న్యాయం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని పదినెలలుగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా ఓపిక పట్టామన్నారు. జీఓ317 సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించినందున సమస్యలన్నీ సానుకూలంగా పరిష్కరిస్తారని ఆశించినవారికి కమిటీ సిఫార్సులు తీవ్ర నిరాశను కలిగించాయన్నారు. భార్యాభర్తలు, ఆరోగ్య కారణాలతో బదిలీలకు జీఓలోనే అవకాశం ఉందని, స్థానికత కోల్పోయిన వారి గురించి నిర్ణయం చేయకపోతే కమిటీ వల్ల ఉపయోగమేంటాని ప్రశ్నించారు. వినిమయ ధరల సూచీకి అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించాల్సి ఉన్న కొన్నేండ్లుగా రాష్ట్రంలో ఈ ఆనవాయితీని పాటించటం లేదన్నారు. పైగా ప్రస్తుతం ఒకటే డీఏ ఇవ్వడం అవమానించడమేనన్నారు. వెంటనే ప్రభుత్వం పునరాలోచించి ఉద్యోగ ఉపాధ్యాయులు మెచ్చే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, జిల్లా కోశాధికారి రమేష్, జిల్లా కార్యదర్శి సుభాష్ జాదవ్, జిల్లా కమిటీ సభ్యులు హరీష్, అనిత, నవీన్ మండలాల బాధ్యులు సుశీల్, రవి, దీపిక, కాలేరామ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి




నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని జాతీయ రహదారిపై ఆనుకుని ఉన్న జర్నలిస్ట్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రాత్రికిరాత్రి టేలా ఏర్పాటు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు ఎస్సైస చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ రామ్మోహన్ రావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే టేలాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. విలువైన ప్రభుత్వ భూమిని కాజేసే ప్రయత్నం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపివేయాలి

మండలంలోని జాతీయ రహదారి 363కి ఆనుకొని ఉన్న జర్నలిస్ట్ కాలనీలో అక్రమ కట్టడాలతో పాటు రేకు డబ్బా టెల వెలిశాయి. మండలంలోని కూతవేటు దూరంలో పోలీస్ స్టేషన్, రెవెన్యూ శాఖ కార్యాలయాలున్న భూ అక్రమార్కులు ఎటువంటి అడ్డు అదుపు లేకుండా అక్రమ కట్టడాలతో పాటు టేలలను నెలకొల్పుతూ కబ్జాలకు పాల్పడుతున్నారని, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

గంగమ్మతల్లికి మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్సీ



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలో మత్స్యకారుల కాలనీలో ఏర్పాటు చేసిన గంగా మాత ముగింపు ఉత్సవాల్లో ఎమ్మెల్సీ దండేవిఠర్ ఆదివారం పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న గంగా మాత ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అన్నారు. గంగా మాత విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్సీని మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం గంగా మాత విగ్రహాన్ని శోభాయాత్ర ద్వారా నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్, చింతలమానేపల్లి మాజీ ఎంపీపీ డబ్బులు నానయ్య, సహకార సంఘం చైర్మన్ ఓం ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు బషరత్, నాయకులు నాయిర్ అలీ, సామల రాజన్న, రంగు సురేష్ గౌడ్, సూర్ల ఇస్తారి, గుమ్మల శ్రీనివాస్, పాకాల బిచ్చయ్య, గాండ్ల పోశయ్య, సూర్ల సతీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని సన్మానించిన బారెగూడ గ్రామస్తులు

మండలంలోని బారెగూడ గ్రామస్తులు ఎమ్మెల్సీ దండేవిఠల్‌ను శాలువాలతో సన్మానించారు. మొదటిసారి ఆ గ్రామానికి ఎమ్మెల్సీ రావడంతో కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. త్వరితగతిన సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీయ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదల సంక్షేమమం కోసం కృషి చేస్తుందన్నారు. సీఎం కూడా మారుముల గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రేణిగుంట్ల పెంటయ్య, గ్రామస్తులు ఉన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని విజయనగరం గ్రామంలోని సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2006-2007 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి అనుభూతులను పంచుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు చెప్పిన విద్యా బుద్ధుల వల్ల ఈ రోజు మేము వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకెళుతున్నామన్నారు. అప్పుడు పదవ తరగతిలో మొత్తం 45 మంది ఉండగా 40 మంది కలసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు సిస్టర్ అలీస్, మారయ్య, దిలీప్ సొతుకు శ్రీనివాస్, సీతారాం వెరోనికలతో పాటు ఇన్ఫంట్ జీసస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టోంలున్నారు.

ముంజంపల్లిలో అటవీ అధికారుల దాడులు

- రూ.1,50,000 నిల్వ ఉన్న కలప స్వాధీనం

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని కర్జవెల్లి అటవీ రేంజ్ పరిధిలోని ముంజంపల్లి గ్రామంలో ఆదివారం కర్జవెల్లి ఇన్‌చార్జి రేంజ్ అధికారి ఎక్బాల్ ఆధ్వర్యంలో గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉన్న రూ.1,50,000 టేకు దుంగలను పట్టుకున్నారు. గ్రామంలోని పలువురి ఇళ్లతో పాటు పంట చేలల్లో తనిఖీలు చేపట్టి నిలువ ఉన్న కలప లభ్యం కావడంతో పలువురుపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
సోమవారం | అక్టోబర్ 28, 2024 | www.navatelangana.com

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకం

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని అచలాపూర్ హై స్కూల్ క్రీడాకారులకు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి రూ.5 వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 మంచిర్యాల జిల్లా బాలికల కబడ్డీ ఎంపిక పోటీలలో జోనల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు క్రీడా దుస్తులకు నగదును అందించినట్లు పీఈటీ సాంబమూర్తి తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించినందుకు అచలాపూర్ అధ్యాపక బృందం పేరెంట్స్ కమిటీ సూరన్ రవీందర్‌రెడ్డిని అభినందించారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మున్సిపల్ పరిధిలోని మిషన్ కాంపౌండ్ ఏరియాలో నడి రోడ్డుపై మిషన్ భగీరథ పైపు పగిలి నీరు నిల్వ ఉంటూ బురదమయంగా మారింది. గత మూడు నెలలుగా నీరు రోడ్డుపై ప్రవహించి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్ని సార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సీపీఐ నూతన మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం నూతన కమిటీ ఎన్నుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శిగా సాలిగామ సంతోష్, సహాయ కార్యదర్శిగా నరాల ప్రహ్లాద్, మలిసెట్టి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వాసాల నాగరాజు, కోశాధికారిగా పట్టి శంకర్ ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యుడు మిట్టపల్లి వెంకటస్వామి, రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్, బెల్లంపల్లి టౌన్ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బెల్లంపల్లి రూరల్ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ భయ్యా మొగిలి, మాజీ ఎంపీపీ కామెర మల్లయ్య పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

- అదనపు కలెక్టర్ మోతీలాల్

నవతెలంగాణ-హాజీపూర్



మత్స్యకారుల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని అదనపు కలెక్టర్ సభవత్ మోతీలాల్ అన్నారు. ఆదివారం మండలంలోని గుడిపెట్ వద్ద శ్రీపాద ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉచిత చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ చేపల పెంపకం ద్వారా మత్స్యకారులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తారని అన్నారు. మత్స్య సంపద పెంచాలని తద్వారా మత్స్య కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి చేపట్టినట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని 320 మత్స్య కారుల సొసైటీలు ఉన్నాయని అందులో 120 సొసైటీలకు ఉచిత చేప పిల్లల పంపిణి చేయనున్నట్లు తెలిపారు. చేపలను రక్షించుకొని పెంచుకునే బాధ్యత మత్స్యకారులపై ఉందని సూచించారు. సొసైటీల ద్వారా చేపలను అమ్ముకునే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఒక కోటి ఉచిత చేప పిల్లలను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రస్తుతం ఎల్లంపల్లి లక్ష చేపపిల్లలని వదినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- అదనపు కలెక్టర్ మోతీలాల్ సబవత్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

చదువుతోపాటు పిల్లలు క్రీడల్లో రాణించాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ సభావత్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంజేపీ పాఠశాలలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ అండర్-14, అండర్-19 ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించి జీవితంలో ఉన్నత స్థానాల్లో ఉండాలని తెలిపారు. పట్టుదల, కృషితో ఎంతో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని, స్పోర్ట్ మీట్‌లో పాల్గొంటున్న విద్యార్థులందరూ ప్రతిభ కనబరచాలని కోరారు. క్రీడలలో భాగంగా గెలుపోటములు సహజమేనని, నిరాశ చెందకుండా పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులను, ఉపాధ్యాయులు అనుసరించాల్సిన వ్యూహాలను, మూడు రోజుల పాటు కొనసాగే ఈ స్పోర్ట్స్ మీట్‌ను పటిష్టమైన ప్రణాళికతో విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రోనాల్డ్ కిరణ్ మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటాలని కోరారు. అనంతరం జిల్లాలోని విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ మొదటగా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ గోపీచంద్, డీసీఓ శ్రీధర్, జిల్లాలోని వివిధ పాఠశాలల ప్రిన్సిపల్‌లు, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి బీసీ కమిషన్ చైర్మన్ పర్యటన విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం రానున్న బీసీ కమిషన్ చైర్మన్ పర్యటనను బీసీ కులస్తులు విజయవంతం చేయాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కడార్ల నరసయ్య కోరారు. ఆదివారం జాన్నారంలో మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ సభ్యులు 28 నుంచి చేపడుతున్న బహిరంగ విచారణపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టి బీసీ కులస్తులను అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ పర్యటనలో బీసీ కమిషన్ చైర్మన్ జి నిరంజన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాల లక్ష్మి, సభ్య కార్యదర్శి బాల మాయదేవిలతో కూడిన బృందం 28న ఆదిలాబాద్‌కు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ సాధించు కోవడానికి కలిసి కట్టుగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కట్ట నాగరాజు, ఇందూరు సత్యనారాయణ, కట్ట వెంకటేశ్వర్లు, వేమునూరు శేఖర్, రాజు, చాకలి భీమయ్య, నవీన్, శ్రీరాముల అజయ్ పాల్గొన్నారు.

లోకల్ వాళ్లను నాన్ లోకల్ అంటే ఎలా..?

- ఉన్న ఒక్క పోస్టు ఎవరికి కట్టబెట్టేందుకు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల కుక్కు పోస్ట్‌కు దరఖాస్తులు చేసుకున్న లోకల్ అభ్యర్థులను అధికారులు నాన్ లోకల్‌గా పరిగణించడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. కస్తూరిబా పాఠశాల హెడ్ కుక్ పోస్ట్ భర్తీ చేసేందుకు ప్రకటన విడుదల చేసిన అధికారులు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో 14 మంది దరఖాస్తు చేసుకోగా ఒకరిద్దరు మినహా మిగతా వారంతా స్థానికులే అయినప్పటికీ చాలామందిని నాన్ లోకల్‌గా పరిగణించారు. జైపూర్ మండల కేంద్రానికి చెందిన ఎస్సీ కాలనీ ఎస్టీ కాలనీకి చెందిన ఇద్దరు అందరి మాదిరిగానే హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోగా ఈ ఇద్దరిని నాన్ లోకల్‌గా నోటీస్ బోర్డ్‌పై పెట్టారు. ఉన్నది ఒకటే పోస్ట్ కాగా ఈ పోస్టును ఎవరికో కట్టబెట్టాలన్న దురుద్దేశంతో లోకల్ వాళ్లను నాన్ లోకల్ గా ప్రకటించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ హెడ్ కుక్ పోస్టులో లోకల్ వారికి అందులోని అర్హులైన వారితో భర్తీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వారు నివాస పత్రాలు జతచేయలేదు

- ఎంఈఓ శ్రీనివాస్

కస్తూరిబా పాఠశాల కుక్ పోస్ట్ భర్తీకి స్వీకరించిన దరఖాస్తుల్లో రెసిడెన్స్ సర్టిఫికెట్లు దరఖాస్తుతో జత చేయని వారిని నాన్ లోకల్‌గా పరిగణించాం. మహిళలకు సంబంధించిన ఈ పోస్టు భర్తీకి సంబంధించి అందిన దరఖాస్తుల్లో లోకల్ వారై ఉన్నప్పటికీ వివాహంతో వేరే గ్రామానికి వెళ్లిన వారిని కూడా నాన్ లోకల్‌గా పరిగణించాల్సి వస్తుంది. ఈ పోస్ట్ భక్తిలో అర్హులైన వారు అనుభవం కలిగిన వారినీ భర్తీ చేయడం జరుగుతుంది. తహసీల్దార్, ఎంపీడీఓతో కలిసి అభ్యర్థుల దరఖాస్తులు వారికి ఉన్న అనుభవం గుర్తించి నియామకం చేపడతాం.

శిథిలావస్థలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి



నవతెలంగాణ-తాండూర్

శిథిలావస్థలో ఉన్న బెల్లంపల్లి సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లిలో స్కూల్, బాయ్స్ కాలేజ్, ఎస్సీ హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పక్క భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్‌లో ఉండడంతో పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రయివేట్ యాజమాన్యాలు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించకపోవడంతో ఫీజు నగదు రూపంలో చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాలనే నిబంధనలు పెడుతున్నాయన్నారు. దాంతో పేద విద్యార్థులు పై చదువులు చదువుకోలేక విద్యను మధ్యలో ఆపేసే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ నాయకులు రాజ్ చరణ్ తేజ్, సాయికుమార్, విష్ణువర్ధన్, విజయ్ పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

నవతెలంగాణ-తాండూర్



నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. ఆదివారం మండలంలోని బోయపల్లి నుంచి గోండుగూడెం మీదుగా బుగ్గ టెంపుల్‌కి రూ.2.60 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. నెన్నెల మండలంలోని కోనంపేటలో రూ.2.43 కోట్లతో మంజూరైన బీటీ రోడ్ల పనులను ప్రారంభించారు. కాంట్రాక్టర్లు సత్వరమే పనులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో అంచలంచలుగా రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు సమకూరేలా అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం యాక్సిడెంట్‌లో గాయాలయి కోలుకుంటున్నా బోయపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ సుందిళ్ల భూమయ్యను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుల కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, మండల అధ్యక్షుడు మహమ్మద్ ఈసా, జిల్లా ఉపాధ్యక్షుడు తొంగల మల్లేష్, సీనియర్ నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, సిరంగి శంకర్, మాసాడి తిరుపతి, సంకూర్ శంకర్, మునిమడుగుల మహేందర్, దుర్గం గోపాల్, మాసాడి నారాయణ, మిట్ట వేణుగోపాల్, భీమరాజ్ కుమార్, మాసాడి భీమయ్య, ఇప్పరవి ఉన్నారు.

నిరుద్యోగులకు వేదిక ప్రయివేటు స్టడీ హాల్



నవతెలంగాణ-నస్పూర్

నిరుద్యోగ విద్యార్థులకు చదువుకోవడానికి స్థానిక స్టడీ హాల్స్ మంచి వేదికలుగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు కేవలం నగరాలకు మాత్రమే ఉండే స్టడీ హాల్స్ సంస్కృతి ఇప్పుడు చిన్నచిన్న పట్టణాలకు వ్యాపించింది. ఎక్కువగా గహిణులు, చిరుద్యోగులు ఇంటి దగ్గర చదువుకోలేని పరిస్థితి ఉన్న వారి కోసం ఉదయం 6 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వీరిలో చాలామంది ప్రభుత్వ లైబ్రరీ ఉపయోగించుకుంటున్నప్పటికీ అక్కడ అత్యధిక మంది ఉండడం వల్ల ప్రయివేట్ స్టడీ హాల్ నీ సంప్రదిస్తున్నారు. సీసీసీ కార్నర్‌లో స్వాతి డిగ్రీ కాలేజ్ యందు అబ్దుల్ కలాం జాతీయ అవార్డు గ్రహిత, పలు టీవీ ఛానల్ తెలుగు రాష్ట్రాల జాగ్రఫీ ఫ్యాకల్టీ పాదం సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ స్టడీ హాల్ నిర్వహిస్తున్నారు. దానిలో దాదాపు ప్రతిరోజూ 30 మంది హాజరవుతున్నారు. ఇందులో గృహిణులు, నిరుద్యోగులు వస్తున్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో దాదాపుగా పదిమంది మెయిన్స్‌కు ఉత్తీర్ణులయ్యారు.

ఒకే డీఏ విడుదల సరికాదు : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-మంచిర్యాల

ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్కే వాయిదా మాత్రమే విడుదల చేయడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గత పదినెలలుగా ఉద్యోగులమంతా ఓపికపట్టామని తెలిపారు. మరో రెండు వాయిదాలు బకాయి పడడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. ప్రతి ఆరు నెలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించబడుతుందని, గత కొన్నేళ్ళుగా రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు ఈ ఆనవాయితీని పాటించటం లేదన్నారు. ఇవ్వాల్సిన సమయంలో ఇవ్వకుండా పండుగలప్పుడు కానుకలుగా ఇస్తున్నట్లు ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగుల జేఏసీతో సీఎం జరిపిన చర్చల అనంతరం కనీసం రెండు వాయిదాల డీఏ అయినా ఇప్పుడు ఇస్తారని ఉద్యోగులు భావించారన్నారు. కానీ ఒక్క డీఏ మాత్రమే విడుదల చేయటంతో ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పున: సమీక్షించుకోవాలని కోరారు.

కక్షసాధింపు చర్యలను ప్రజలు సహించరు

- మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

దూషణలు, ఆరోపణలను ప్రజలు సహించరని, అక్రమ కట్టడాలు ఉంటే పార్టీలకతీతంగా అందరివీ కూల్చేయాలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును కోరుతున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ అనుచరులు మొన్నటి పాత్రికేయ సమావేశంలో అసత్య ఆరోపణలు చేస్తూనాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆరోపించిన వాదనలను గతంలోనే నిరూపించడం జరిగిందన్నారు. కొన్నిటికి ఇప్పటికే కోర్టులో స్టే ఆర్డర్ కూడా ఉందని, అది మరిచిపోయి నాగభూషణం అనుచరులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. నాగభూషణం పట్టణంలోని తన ఇంటి ఆవరణలో 10 ఫీట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని షాపింగ్ కాంప్లెక్స్ కట్టుకున్నాడన్నారు. ఎవరైతే ఆక్రమించి కట్టుకున్నారో వాటిని తప్పకుండా కూల్చివేయాలన్నారు. ప్రభుత్వం ఆక్రమణకు గురైన వాటిపై ఏలాంటి చర్యలు తీసుకున్న మేము స్వాగతిస్తామని అన్నారు. అంతే కాకుండా కాంగ్రెస్ నాయకులు ఆక్రమించిన వాటిని కూడా తప్పకుండా కూల్చి సమన్యాయం చేయవలసిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందని తెలిపారు. అభివృద్ధికి మేము అడ్డం కాదని, ఎమ్మెల్యే ప్రజల కోసం చేస్తున్న మంచి పనులను స్వాగత్తిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాల కాంపౌండ్‌ను కబ్జా చేయలేదని, ఒకవేళ నా కార్ పార్కింగ్ అక్కడ చేయవద్దంటే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవచ్చున్నారు. కక్షపూరిత వైఖరితో దూషణలు చేస్తే ఎదుర్కొంటామని హెచ్చరించారు. మేము 10 ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు.



కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

నవతెలంగాణ-జైపూర్

దృష్టి లోపంతో పాటు కంటికి సంబంధించిన ఇతర సమస్యలు ఏవైనా నిర్లక్ష్యం చేయకూడదని మంచిర్యాలకు చెందిన కంటి వైద్యులు సుభేష్ సూచించారు. మండలంలోని బెజ్జాల గ్రామంలో కంటేశ్వర ఐ అండ్ ఆప్టికల్స్ మంచిర్యాల వారి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 45 మంది కంటి సమస్య ఉన్న వారిని పరీక్షించారు. ఇందులో 20 మందికి కంటి అద్దాలు అవసరమవుతున్నట్లు తెలిపారు. మరో నలుగురికి శస్త్ర చికిత్స అవసరమని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బందితో గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జైపాల్ గౌడ్ పాల్గొన్నారు.



కొత్త ఉపాధ్యాయులకు అవగాహన



నవతెలంగాణ-మంచిర్యాల

2024 డీఎస్సీ ద్వార జిల్లాలో కొత్తగా నియమకమైన ఉపాధ్యాయులకు డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) అధ్వర్యంలో అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఆదివారం మంచిర్యాల బాయ్స్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో సర్వీస్ రూల్స్, లీవ్ రూల్స్, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ, వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యత అనే అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అవగాహనా సదస్సుకు డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శామ్యూల్ ముఖ్య అధితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య వ్యవస్థను పటిష్టమైన మార్గంలో పెట్టడానికి కొత్త రక్తం ఎంతగానో అవసరం ఉందని, మూత పడుతున్న బడులు, తక్కువ సంఖ్య విద్యార్థులు ఉన్న పాఠశాలలను బలోపేతం చేయడం, తల్లిదండ్రుల కు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పెంచడం లాంటివి ఉపాద్యయులకు పెద్ద బాధ్యత అని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించలన్నారు. లీవ్ రూల్స్ పైన జిల్లా కార్యదర్శి జాకీర్ హుస్సేన్, పూర్వ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొండయ్య మాట్లాడుతూ ఉపాద్యాయులకు ఉన్నటువంటి వివిధ రకాల సెలవుల గురించి వాటి వినియోగం గురించిన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ప్రకాష్, మండల బాధ్యులు శ్రీనివాస్, ఆంజనేయులు, నూతన ఉపాద్యాయులు సాయికుమార్, శ్రీనివాస్, రచన, శశి కుమార్, మల్లీశ్వరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రయివేటు గెస్ట్ హౌస్ సీజ్

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని ప్రయివేటు గెస్ట్ హౌస్‌లో అసంఘిక కార్యకలాపాలు జరుపుతున్నాయన్న ఆరోపణలకు మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు ఆదివారం సీజ్ చేశారు. సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆర్డీఓ ఆదేశాల ప్రకారం మంచిర్యాల తహసీల్దార్ లతో కలిసి గెస్ట్ హౌస్ సీజ్ చేశామని గతంలో అట్టి గెస్ట్ హౌస్‌లో వ్యభిచారం నిర్వహించే సమయంలో విటులతో పాటు నిర్వాహకుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలో ఏదైనా లాడ్జిలు లేక ఇండ్లను అద్దెకు తీసుకోని వ్యభిచారం, అసంఘిక కార్యకలాపాలు నడిపినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని సీజ్ చేయడం జరుగతుందని సీఐ తెలిపారు.

మహనీయుల అడుగు జాడల్లో నడవాలి

- ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్

నవతెలంగాణ-ముధోల్



మహనీయుల అడుగుజాడల్లో నడవాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం ముధోల్‌లో హిందువాహిని ముక్తపూర్ శాఖ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, అన్నబావు సాఠే, స్వామి వివేకానంద స్వామి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు రోల్ల రమేష్, వీడీసీ అధ్యక్షుడు నారాయణ, కోశాధికారి సాయినాథ్, బీజేపీ మండలాధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు, సుదర్శన్, దేవోజి భూమేష్, పోతన్న యాదవ్, రాంభీ, శ్రీనివాస్, బాలు, నర్సాగౌడ్, గుంజలోల్ల నారాయణ, సంతోష్, టి.రమేష్, జీవన్ పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ఆదిలాబాద్ మండలంలోని చాందా(టి) కోదండ రామాలయాన్ని ఆదివారం కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కంది శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, పోరెడ్డి కిషన్, ఎంఏ షకీల్, ఆదిలాబాద్ రూరల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అంచెట్టి నాగన్న, నాయకులు సింగిరెడ్డి రామ్‌రెడ్డి, బండి దేవిదాస్‌చారి, ఎల్మ రామ్ రెడ్డి, సయ్యద్ షాహిద్ అలీ, గ్రామస్తులు, మాజీ సర్పంచ్ బొజ్జ అడెల్లు, మాజీ ఉపసర్పంచ్ లంక సుదర్శన్, కాప్డే పోచ్చిరామ్, డాక్టర్ మారుతీ, మహేష్, పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పత్తిపంట క్షేత్ర ప్రదర్శన

- ఆదర్శ రైతు నారాయణరెడ్డికి సన్మానం



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రానికి చెందిన కౌట్ల నారాయణరెడ్డి ఆదర్శరైతు సాగు చేసిన నూజివీడు సీడ్స్ వారి ఆధ్య-1134 అనే పత్తి రకం పంట క్షేత్ర ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. ఆధ్య అనే పత్తి వంగడం అధిక మొక్కల సాంద్రత పద్ధతిలో సాగుచేసుకోవడం ద్వారా అధిక దిగుబడులను పొందవచ్చని తెలిపారు. ఈ వంగడం మెట్ట అధిక వర్షపాతాన్ని తట్టుకుంటుందన్నారు. ఎక్కువ సంఖ్యలో ఆకులు ఉండటం వల్ల అధిక వర్షాలు తట్టుకొనే శక్తిని కలిగి ఉంటుంది. ఈ రకమైన ప్రత్తి వంగడం అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుంది. అలాగే గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి తప్పించుకుని తక్కువ పంట కాలం కలిగి తొందరగా పత్తి కోతకు వచ్చి రెండో పంటకు అనుకూలంగా ఉండి అధిక దిగుబడి అందిస్తుంది. అలాగే పత్తి తొందరగా కోతకు రావడం వల్ల రెండో పంట మొక్కజొన్న నూజివీడు విన్నర్-8352. వేసుకోవచ్చని డీఆర్‌ఎం రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చుట్టు పక్కన 10గ్రామాల రైతులు, నూజివీడు సిబ్బంది స్థానిక డిస్ట్రిబ్యూటర్స్ జి.సచిన్, కిష్టయ్య, కౌట్ల(బి) మ్యాక్ట్ ప్రెసిడెంట్ నాకిరెడ్డి నర్సారెడ్డి, ఎల్.వినోద్, ఎస్‌ఓ సాయినాథ్, ఎండీఓ ప్రశాంత్, స్థానిక డీలర్లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల నియోజకవర్గంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పరామర్శించారు. మండలంలో దొమ్మటి లక్ష్మయ్య(నంనూర్), పాయిని రాజన్న(పాత మంచిర్యాల), బోలిశెట్టి చంద్రయ్య(పాత మంచిర్యాల), మైలారం వెంకట నర్సయ్య(మంచిర్యాల) కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వారికి మనోధైర్యాన్నిచ్చారు. కార్యకర్తలు ఎవరు అధైర్యపడద్దని రాబోవు రోజులు బీఆర్‌ఎస్‌వే అని అన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్



అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. శ్రీరాంపూర్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం..పెనుగొండ సంపత్(46) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మతి స్తిమితంలేక అనారోగ్యంతో బాదపడుతూ ఈ నెల 23న ఇంటి నుండి బయటకి వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదని భార్య ఫిర్యాదు చేసింది చేయడంతో నాలుగు రోజుల తర్వాత అటవీ ప్రాంతంలో వ్యక్తి ఉరివేసుకొని కనిపించాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో మంచిర్యాల లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ బ్రాంచ్ కార్యాలయాన్ని ఆదివారం మున్సిపాల్ చైర్మన్ సల్మాన్ కాంతయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యమత్యంతో అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, హనుమాన్లు, రాయలింగం, మంచిర్యాల కమిటీ చైర్మన్ కాళిక, కమిటీ సభ్యులు, సంస్థ సీనియర్లు పూర్ణచంద్రరావు, ఫహీం, రఫిక్, శ్రీనివాస్‌గౌడ్, భావన రామారావు పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. బహుబాగు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని పేపర్‌మిల్ సమీపంలోనున్న నవదుర్గ ఆలయం ఎదురుగా ఫెరోజుద్దీన్ అనే రైతు కూరగాయల సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. సుమారు మూడు ఎకరాల భూ విస్తీర్ణంలో వివిధ రకాల కూరగాయలను సాగుచేస్తున్నారు. ఈ మూడు ఎకరాల భూమిలో కాలీఫ్లవర్, టమాట, ఉల్లి, వివిధ రకాల పూలను నాటి తమ కుటుంబ పోషణ కొనసాగిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. పంటలు ఎలాంటి చీడపీడలు ఆశించకుండా ముందు జాగ్రత్తగా స్ప్రే మందులు వాడి సమయానుకూలంగా వాటికి రసాయనికి మందులు అందజేస్తూ పంటను కాపాడుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు.

ఒకే పోలీస్ విధానం అమలు చేయాలి



నవతెలంగాణ-హాజీపూర్

ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపడుతున్నారు. ఇటీవల బెటాలియన్ ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేసిన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జిపై చేతిలో ఫ్లకార్డులు పట్టుకుని దాదాపు గంట పాటు ఆందోళన చేశారు. గడ్డి తీయడం, రాళ్ల ఎత్తడం, పలుగు, పార పట్టడం పోలీస్ ఉద్యోగం కాదని కానిస్టేబుళ్ల భార్యలు అంటున్నారు. పని భారం తగ్గించాలని, వారానికి ఓ రోజు సెలవు ఇవ్వాలని, రీకాల్డ్ పద్ధతిని ఉపసంహరించుకోవాలని, తరుచూ బదిలీలు చేపట్టకుండా ఒకే ప్రాంతంలో ఐదేండ్లు పని చేసేలా చూడాలంటున్నారు.

బెటాలియన్‌లో సస్పెన్షన్ గురైంది వీరే..

బెటాలియన్ ఆందోళనలకు, అశాంతికి కారణమై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సస్పెన్షన్ వేటుపడింది. ఇందులో హెడ్ కానిస్టేబుల్ కె.సతీష్రం, పోలీస్ కానిస్టేబుళ్ల జి.శ్రీనివాస్, జి.గోపి, ఆర్.రవి, పి.శివబాలకృష్ణలున్నారు.

కమాండెంట్ కు వినతి..

తమ న్యాయమైన సమస్యలను తీర్చాలంటూ ప్రభుత్వం, పోలీస్ అధికారులు స్పందించి అండగా నిలవాలని కోరుతూ ఆదివారం కమాండెంట్ వెంకటరాములుకు కానిస్టేబుళ్ల భార్యలు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు బెటాలియన్ ప్రధాన ద్వారం వద్ద కానిస్టేబుళ్ల భార్యలు చేపట్టిన ధర్నాలో భాగంగా బెటాలియన్ నుంచి సస్పెన్షన్‌కు గురైన కానిస్టేబుళ్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కూడా డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న బందోబస్తు..

బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు ఆందోళనలు చేపట్టకుండా హాజీపూర్ పోలీసులు బెటాలియన్ ఎదుట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఏక్ పోలీస్ నినాదంతో నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

మంచిర్యాల అభివృద్ధి పీఎస్సార్‌తోనే సాధ్యం

- పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్
- కరకట్ట నిర్మాణానికి రూ.255 కోట్ల మంజూరు
- సీఎం రేవంత్‌రెడ్డి, భట్టిల చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే పీఎస్సార్‌తోనే సాధ్యమని మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్ అన్నారు. మంచిర్యాల పట్టణం రాళ్లవాగు పరిధిలో కరకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.255 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం గుడిపేట్, ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, డీప్యూటీ సీఎం భట్టి, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు చిత్రపటాలకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. గత నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసిన వ్యక్తి ఏనాడు నియోజకవర్గ అభివృద్ధి, మంచిర్యాల పట్టణాభివృద్ధిపై చర్యలు తీసుకోలేదన్నారు. ప్రతి వానాకాలంలో రాళ్లవాగు ఉధృతికి పట్టణంలోని పలు కాలనీలు నీట మునుగుతున్నాయని గుర్తుచేశారు. మొన్నటి ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రెండు రోజుల కింద రాళ్లవాగు చుట్టూ రెండు వైపులా కరకట్ట నిర్మాణానికి రూ.255 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టి రోడ్ల విస్తరణ, మాతాశిశుఆస్పత్రి నిర్మాణం, ఇండస్ట్రియల్ హబ్, లాంటి కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మెన్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దండారీ ఉత్సవాలు



- ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలతో వేడుకలు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ సల్పాలవాగు సమీపంలోని ఆదివాసుల ఆరాధ్య దైవం వెంకటాద్రి ఆలయం వద్ద ఆదివారం దండారీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసి దండారీ ఉత్సవాలను ప్రారంభించారు. ఆయా గ్రామాలకు చెందిన దండారీలు ఒక్క చోటకు చేరి ఉత్సవాలను చేశారు. ఆదివాసీ సంస్కృతిపై గుస్సాడీ, దండారీ ప్రదర్శనలు చేశారు. గుస్సాడీ నృత్యాలతో వారి సంప్రదాయానికి ప్రతీకగా అందరినీ ఆకర్షించాయి. అనంతరం దండారీ దర్బార్ నిర్వహించి, ఆదివాసీ సమస్యలపై చర్చించి తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దండారీ దర్బార్‌లో ఆదివాసుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాలగిరిధర్, హెల్డర్ హెడ్ కులకర్ణి ఆధ్వర్యంలో భోజన వసతి, ఇతర సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ సహకార చైర్మెన్ పూస్కూరి వంశీకృష్ణరావు, దండారీ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆడే జంగు, పెంద్రం హన్మంతు, మడావి వెంకటేశ్, మడావి అనంతరావు, ఆత్రం జంగు, ఆదివాసులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధుడి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

భారత విప్లవోద్యమ కమ్యూనిస్టు యోధుడు ప్రజాపంథా మార్గదర్శకుడు అమరుడు కామ్రేడ్ డీవీకే స్మారక విగ్రహావిష్కరణ వచ్చేనెల 9న ఉంటుందని సిపిఐఎంఎల్ మాస్ లైన్ నాయకులు వి.ప్రభాకర్, దేవారం తెలిపారు. ఆదివారం డీవీకే విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 53 సంవత్సరాలు విప్లవోద్యమ నిర్మాణంలో అలుపెరగకుండా ఉద్యమించిన వీరుడని కొనియాడారు. మితవాదాన్ని వ్యతిరేకించే సమయంలో అతివాద ప్రమాదం ఉంటుందని అతివాదాన్ని అధిగమించే ప్రయాణంలో మితవాద ప్రమాదం ఉంటుందని గుర్తించి ప్రజలే చరిత్ర నిర్మాతలని ప్రజాపంథా మార్గమని పార్టీలో అంతర్గతంగా అనేక సైద్ధాంతిక పోరాటాలు కొనసాగించారని తెలిపారు. ఈ నేపథ్యంలో అనేక అవమానాలకు, అవహేళనలకు గురైన వెనుకడుగు వేయలేదని గుర్తుచేశారు. సంక్షోభాలు, సుడిగుండాల నుంచి ఎదురీదిన ఉక్కుమనిషి అని కొనియాడారు. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి మనకు భౌతికంగా దూరమైనప్పటికీ అన్న చూపిన ప్రజాపంథా మార్గం ఉందని ఆ మార్గంలో ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. కామ్రేడ్ డివికె విగ్రహవిష్కరణ సభ నవంబర్ 9న పట్టణంలో ఉంటుందని ఈ సభకు కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్ కేజీ రామ్‌చందర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని, ప్రజా సంఘ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ముత్తన్న, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్, యు.రాజన్న, శేఖర్, ఠాకూర్, శ్రీనివాస్, నిఖిల్, పిడిఎస్‌యు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

జెనిటిక్ డిసార్డర్స్‌పై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కంఠేశ్వర్

లయన్ సహారా, శ్రీ ధన్వంతరీ ఫెటల్ మెడిసన్ సెంటర్, సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జెనిటిక్ డిసార్డర్‌పై నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ ధన్వంతరీ హాస్పిటల్ హైదరాబాద్ రోడ్‌లో ఆదివారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఫెర్నాన్‌డేజ్ హైదరాబాద్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ గాయత్రి, డాక్టర్ జ్యోష్న, డాక్టర్స్ ప్రశాంత్, డాక్టర్ మాధవి హాజరయ్యారు. డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ జన్యుపరమైన సమస్యలపై ఏ జాగ్రత్తలు తీసుకోవాలా క్షుణ్ణంగా వివరించారు. డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ.. గర్భస్థ శిశువుకు రోగాలను గుర్తించే సమయం, స్కానింగ్ ఏ సమయంలో చేయాలనే అంశాలపై క్లుప్తంగా వివరించారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ విజనంద్, కార్యదర్శి ధనుంజయరెడ్డి, రామారావు, సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ చైర్మన్ లయన్ ఉదయ సూర్య భగవాన్, డైరెక్టర్ పోశెట్టి, కోఆర్డినేటర్ వినోద్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

మత్తు డాక్టర్ల అధ్యక్షులుగా డిప్యూటీ డిఎంహెచ్ఓ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్ హైదరాబాద్‌లో శనివారం రాత్రి జరిగిన రాష్ట్రస్థాయి మత్తుడాక్టర్ల సమావేశంలో పాల్గొన్నారు. కాగా రాష్ట్ర మత్తు డాక్టర్ల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గానికి సన్మానం



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే పాయల శంకర్ సన్మానించారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నూతన కార్యవర్గం ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొప్పుల రమేష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షులు మేకల మల్లన్న, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- కవ్వాల్ టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం



నవతెలంగాణ-జన్నారం

అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీఎఫ్) శాంతరాం హెచ్చరించారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని టీడీసీలో రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పలు ప్రాంతాలలో చెట్లు నరికివేతకు గురి కావడం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కవ్వాల్ టైగర్ జోన్ జీరో స్మగ్లింగ్ కోసం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. విధుల నిర్వాహణలో నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు తగు ప్రణాళికలు రూపొందించి, చర్యలు తీసుకోవాలన్నారు. సీతకోక చిలుకల గార్డెన్ పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్. రేంజ్ అధికారులు సుష్మారావు, శ్రీనివాస్. డీఆర్వో తిరుపతి పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రురాలికి చేయూత



నవతెలంగాణ-దండేపల్లి

స్నేహితులంటే కేవలం సంతోషాలలోనే కాదు కష్టాల్లో కూడా తోడుంటామని దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు తమ తోటి స్నేహితురాలు అనారోగ్యంతో బాధపడుతుందని తెలుసుకుని ఆమెకు ఆర్థికంగా సహాయాన్ని అందజేశారు. మండల కేంద్రానికి చెందిన వేముల సుమలత కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఆమె చికిత్స కొరకు రూ.21 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి ఆపదలో మేమున్నాము అంటూ స్నేహం విలువ చాటారు. ఆమెకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మనో ధైర్యాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సుమలతతో పాటు చదువుకున్న స్నేహితులు స్థానికులు పాల్గొన్నారు.

క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షునిగా విశ్వనాథ్ రవీందర్

నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులుగా రిటైర్డ్ ఐజీపీ విశ్వనాథ్ రవీందర్ రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని జీడిమెట్లలో సికింద్రాబాద్ క్షత్రియ సమాజ్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొదట ప్రాంతీయ క్షత్రియ (ఖత్రి/పట్కర్) సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ అధ్యక్షతన రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ రవీందర్, విశిష్ట అతిథిగా విచ్చేసిన అఖిల భారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ బాలకిషన్ జ్యోతి ప్రజ్వాలన చేసి సహస్రార్జున చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా క్షత్రియ కులస్తులలో పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యతను రూపుమాపడానికి చారిత్రాత్మకంగా "మిషన్ ఉథాన్" అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని, అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని సమాజ్‌ల నుంచి వివరాలు సేకరిస్తున్నామని అన్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 30 గుంటల స్థలంలో సమాజ్ భవన్ నిర్మాణ పనులు కొసాగుతున్నాయని, స్లాబ్ పనులు పూర్తయ్యాయని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన సలహాదారులు, అఖిల భారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ బాలకిషన్ మాట్లాడుతూ సమాజ్ అభివృద్ధి చెందాలంటే విద్య చాలా అవసరమని, ఐకమత్యముతో సమాజ్ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని అన్నారు. ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కార్యవర్గ పదవి కాలం ముగిసినందున కొత్త అధ్యక్షుని ఎన్నిక ప్రక్రియ నిర్వహించడానికి ఎన్నికల అధికారులుగా కర్తన్ చంద్ర శేఖర్, సిరిగిరి రామ్ కిషన్ వ్యవహరించారు. ఈ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ సభల అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఎన్నికల అధికారులు నిర్వహించిన ఎన్నికల్లో నూతనంగా క్షత్రియ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులుగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన విశ్వనాథ్ రవీందర్‌కు పట్టణ క్షత్రియ సమాజ్ తరఫున అధ్యక్ష కార్యదర్శులు ఆర్మూర్ పట్టు శాలువాతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు.